## బడుగుల బాంధవుడు కాకా...

- ఘనంగా 4వ వర్ధంతి



కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కరీంనగర్:** దివంగత మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి 4వ వర్ధంతిని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. మాజీ జెడ్పీ చైర్మన్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల ఆశయసాధన కోసం అంబేద్కరిజాన్ని, దళితవాదాన్ని గల్లీగల్లీకి తీసుకెళ్లిన ఘనత కాకాకే దక్కిందన్నారు. ఏడు సార్లు ఎంపీగా, రాష్ట్ర, కేంద్ర మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా, సీడబ్ల్యూసీ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా, కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు చేశారన్నారు. కార్మిక నాయకునిగా ప్రస్థానం ప్రారంభించి వంద పరిశ్రమలకు కార్మికసంఘ నాయకుడిగా ఉంటూనే ప్రభుత్వంతో కొట్లాడి వేలాది మంది కార్మికులకు గుడిసెలు వేయించి గుడిసెల వెంకటస్వామిగా, కాకా గా చరిత్రలో నిలిచిపోయారన్నారు. నాయకులు వెన్న రాజమల్లయ్య, మాదాసు శ్రీనివాస్, జొన్నల రమేష్, బొబ్బిలి విక్టర్, పెద్దెల్లి అంజయ్య, సుంకరి గణపతి, చింతల కిషన్, వంగల విద్యాసాగర్, మొసర్ల రాంరెడ్డి, దొంతిగోపి పాల్గొన్నారు.

## ఉన్నత స్థానానికి పునాది పాఠశాలే...

- మధ్యప్రదేశ్ ఐఅండ్‌పీఆర్ కమిషనర్ నరహరి



మాట్లాడుతున్న ఐఏఎస్ అధికారి నరహరి

**పాలకుర్తి(రామగుండం):** ప్రతివ్యక్తి ఉన్నత స్థాయికి ఎదగడానికి పాఠశాల చదువు పునాది వంటిదని మధ్యప్రదేశ్ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ పరికిపండ్ల నరహరి అన్నారు. బసంత్‌నగర్‌లోని ఇండియా మిషన్ సెకండరీ పాఠశాలలో రెండ్రోజులపాటు నిర్వహిస్తున్న గోల్డెన్‌జూబ్లీ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చి, కేశోరాం గెస్ట్‌హౌస్‌లో మాట్లాడారు. ఐఎంఎస్‌ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థులంతా కలిసి స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం జరిగే వేడుకల్లో జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్, మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి సమీర్, సభ్యులు మల్క రామస్వామి, పుప్పాల దయానంద్, పూసాల మోహనాచారి, రాజేందర్, కన్నం తిరుపతి, వెంకటస్వామి, రవి, రమేష్ పాల్గొన్నారు.

# విద్యుత్ బకాయిలు చెల్లించి సహకరించండి

- ఉమ్మడి జిల్లా బకాయిలు రూ.610.10కోట్లు
- టీఎస్ఎన్‌పీడీసీఎల్ కంపెనీ డైరెక్టర్ నర్సింగరావు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న నర్సింగరావు

**కొత్తపల్లి(కరీంనగర్):** వినియోగదారులు సకాలంలో విద్యుత్ బకాయిలు చెల్లించి సంస్థకు సహకరించాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ కంపెనీ డైరెక్టర్(ఆపరేషన్స్) డి.నర్సింగరావు కోరారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలోని ఎస్ఈ చాంబర్‌లో జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏవో, ఏవోలతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విలేకరుల సమావేశంలో నర్సింగరావు మాట్లాడుతూ.. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారని, అదే తరహాలో బకాయిలు చెల్లించి సంస్థను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. జేఎల్ఎంల కొరత మూలంగా క్షేత్రస్థాయిలో కొంత ఇబ్బందులు ఏర్పడుతున్నా.. వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలందించేందుకు అన్‌మ్యాన్డ్ సిబ్బందితో పని చేయిస్తున్నామని చెప్పారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ మీటర్లలో లోటుపాట్లు వెనువెంటనే సవరిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా వివిధ కేటగిరీల కింద రూ.610.10కోట్ల విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. రైతులకు 24 గంటల విద్యుత్‌ను ఎలా సరఫరా చేస్తున్నామో అదే బాధ్యతతో కనెక్షన్‌కు ఏడాదికి రూ.360 చొప్పున వినియోగదారుల చార్జీలు చెల్లించాలని కోరారు. కరీంనగర్ సర్కిల్‌లో పాత బకాయిలు రూ.12.33కోట్లుండగా, ప్రస్తుత డిమాండ్ రూ.3.30కోట్ల బకాయిలున్నాయని, ఇందులో రూ.85లక్షలు మాత్రమే వసూలయ్యాయన్నారు. జగిత్యాల సర్కిల్‌లో పాత బకాయిలు రూ.4.23కోట్లుండగా, ప్రస్తుత డిమాండ్ రూ.3.05 కోట్లు కాగా, రూ.1.23కోట్లు వసూలయ్యాయని, పెద్దపల్లి సర్కిల్‌లో పాత బకాయిలు రూ.5.36కోట్లు కాగా, ప్రస్తుత డిమాండ్ రూ.2.34 కోట్లుండగా, రూ.68లక్షల బకాయిలు వసూలైనట్లు తెలిపారు. యాసంగి పంటకు అంతరాయం లేకుండా రైతులు ఈ నెలాఖరులోగా బకాయిలు చెల్లించి సహకరించాలని కోరారు. కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ కె.మాధవరావు మాట్లాడుతూ విద్యుత్ బకాయిలను గూగుల్ ఆన్‌లైన్ ఎకౌంట్ ద్వారా కూడా చెల్లించొచ్చని, ఇప్పటివరకు 15 శాతం మంది ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు చేస్తున్నారని తెలిపారు. జగిత్యాల ఎస్ఈ శ్రావణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా డీఈలు జె.రాంచందర్‌రావు, రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, ఎస్ఏవో జయశ్రీ, ఏవోలు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ‘అక్కినేని’ అవార్డుల ప్రదానం



అవార్డులతో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు

**కరీంనగర్‌కల్చరల్:** ‘అక్కినేని’ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో అక్కినేని ఐదో అంతర్జాతీయ పురస్కారల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శనివారం కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో అట్టహాసంగా నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ మాట్లాడుతూ.. నాటి, నేటి సినీ కళారంగానికి అక్కినేని నాగేశ్వర్‌రావు ఆదర్శంగా నిలుస్తారని, ఆయన ఆడుగుజాడల్లో నడవాలని సూచించారు. కళకు అందం తెచ్చిన మహానటుడు అక్కినేని అని కొనియాడారు. ఆయన హుందాతనం భావితారలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. అలాంటి మహానటుడి పేరిట ఏటా పురస్కారాలు అందించడం గర్వించదగిన విషయమన్నారు. ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు మాట్లాడుతూ అక్కినేని ప్రజాగుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. సినీరంగంలోనే గొప్ప పేరు ప్రతిష్టలు కలిగిన వ్యక్తి అని కొనియాడారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ అక్కినేని ఫౌండేషన్ నుంచి పురస్కారాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేయర్ రవీందర్ సింగ్, కార్పొరేటర్ జయశ్రీ, అక్కినేని ఫౌండేషన్ వ్యవస్థాపకులు తోటకూర ప్రసాద్, సంస్థ అధ్యక్షులు రావు కల్వల, ఉపాధ్యక్షులు ఆకునూరి శారద, కోశాధికారి ధామ భక్తవత్సల, డైరెక్టర్ వెన్నెం మురళీ ,అక్కినేని కరీంనగర్ జిల్లా ఫ్యాన్స్ అధ్యక్షుడు నారాయణ తదితరలు పాల్గొన్నారు.

**పురస్కారాల గ్రహీతలు వీరే...**

విద్యారత్న పురస్కారం ప్రొఫెసర్ నాగేశ్వర్, సినీరత్న పురస్కారం సుద్దాల అశోక్‌తేజ, విశిష్ట వ్యాపారరత్న పారిశ్రామికవేత్త సజ్జా కిషోర్‌బాబు, రంగస్థల రత్న డాక్టర్ ముప్పవరపు సింహాచలశాస్త్రి, వైద్యరత్న ప్రతిమ మెడికల్ ఇనిస్టిట్యూట్, సేవారత్న పద్మశ్రీ వనజీవి రామయ్య, వినూత్న రత్న చిత్రకారిణి కమలాప్రసాద్‌రావు, మార్షల్ ఆర్ట్ యువ రత్న చేరుపల్లి వివేక్ తేజ అందుకున్నారు.

## కోరం లేక జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా



కోరం కోసం ఎదురుచూస్తున్న సీఈవో

**కరీంనగర్:** జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. జిల్లా కేంద్రంలో రాష్ట్రపతి పర్యటన ఉండడంతో కలెక్టర్, సీపీతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్, సంబంధిత శాసన సభ్యులు సమావేశానికి హాజరుకాలేకపోయారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి జెడ్పీ సీఈవో వెంకటమాధవరావుతో పాటు అధికారులంతా హాజరయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు జెడ్పీటీసీలు రాకపోవడంతో, కోరం లేనందున సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ సీఈవో వెంకటమాధవరావు ప్రకటించారు.

# సిరిసిల్ల ఆసుపత్రిలో వివాదం

- క్రిస్మస్ వేడుకలతో రోగులపై నిర్లక్ష్యం..
- యువకుడి మృతికి కారణంగా ఆరోపణలు
- ఆస్పత్రి సిబ్బందితో బాధితుల వాగ్వాదం
- ఆస్పత్రి ముందు ధర్నా చేసిన బీజేపీ నేతలు



జిల్లాసుపత్రి ముందు ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

**సిరిసిల్లటౌన్:** రోగుల పట్ల సిరిసిల్ల జిల్లాసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా ప్రవర్తించారని, ఆస్పత్రిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకున్నారన్న వివాదం నెలకొంది. అనుమతి లేకుండా వేడుకలు చేసుకుని ఒక నిండు ప్రాణాన్ని సైతం బలితీసుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. శుక్రవారం రాత్రి మృతుడి బంధువులు ఆస్పత్రి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. శనివారం బీజేపీ నేతలు ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు.

**వైద్యుల నిర్లక్ష్యానికి ప్రాణం బలి..?**

చందుర్తి మండలం లింగంపేట శివారులో శుక్రవారం రాత్రి 7గంటల సమయంలో గొంటి సునీల్( 32) అతివేగంతో బైక్ నడిపి అదుపుతప్పి పడిపోయాడు. స్థానికులు సిరిసిల్ల ఏరియాస్పత్రికి పంపించగా.. రాత్రి 8గంటలకు ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డులో సిబ్బంది విధుల్లో లేకుండా క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారని మృతుడి అన్నయ్య మహేష్ తెలిపారు. సుమారు 25 నిమిషాల పాటు సునీల్ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడగా..ఆస్పత్రి సిబ్బంది స్పందించలేదన్నారు. తరువాత ఆస్పత్రిలోని వార్డుబాయ్ ఎమర్జెన్సీ వార్డుకు తీసుకెళ్లి పల్స్‌మీటర్ పెట్టారన్నారు. కానీ డ్యూటీ డాక్టర్ తీరుబడిగా వచ్చి సునీల్ చనిపోయినట్లు రాత్రి 9గంటలకు తెలిపారని ఆరోపించారు. ఆస్పత్రికి వచ్చిన వెంటనే చికిత్స అందిస్తే..బతికే వాడని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడు సునీల్ రెండు నెలల క్రితమే దుబాయ్ వచ్చాడు. జనవరి 3న తిరిగి ఉపాధి నిమిత్తమై వెళ్లాల్సి ఉంది.

**బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా..**

జిల్లాసుపత్రిలో సిబ్బంది విధులను విస్మరిస్తూ.. వేడుకలు జరుపడాన్ని బీజేపీ నేతలు తప్పుబట్టారు. శనివారం ఆస్పత్రి ముందు ధర్నా చేపట్టారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ...వేడులక సమయంలో సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఆస్పత్రిలో ఆర్కెస్ట్రా పాటలతో సిబ్బంది చిందులు వేయడం ఏంటని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వదంతులు మాత్రమే..

శుక్రవారం రాత్రి ఎమర్జెన్సీ వార్డులోని సిబ్బంది వేడుకల్లో పాల్గొనలేదు. డ్యూటీలేని స్టాఫ్ మాత్రమే పాల్గొన్నారు. సునీల్ తీవ్ర గాయాలతో ఆస్పత్రికి వచ్చింది నిజమే. వెంటనే డాక్టర్ ఆయన్ని పరిశీలించి మరణించినట్లుగా కుటుంబ సభ్యులకు తెలిపారు. కానీ పేషెంట్ వచ్చిన సమయంలోనే కేక్‌కటింగ్ జరుగుతుంది. వెంటనే మృతుని బంధువులు మేము చనిపోయిన బాధలో ఉంటే మీరు వేడుకుల చేస్తారా అనడంతో వేడుకలను నిలిపివేశాం.

**– డాక్టర్ తిరుపతి, ఆస్పత్రి సూపరింటెండెంట్**